కాంగ్రెస్ సేవాదళ్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా విఘ్నేంద్రవర్మ



నియామక పత్రాన్ని అందుకుంటున్న విఘ్నేంద్రవర్మ

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా మన్సూరాబాద్ డివిజన్ భవానీనగర్‌కాలనీకి చెందిన విఘ్నేంద్రవర్మ రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ బుధవారం గాంధీభవన్‌లో నియామకపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విఘ్నేంద్రవర్మ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సిమెంట్ రంగంలో తిరుగులేనిది భారతి సిమెంట్స్



మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్స్ ఇంజినీర్ నితీష్ యాదవ్

చాదర్‌ఘాట్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థ భారతి సిమెంట్.. అల్ట్రాప్లస్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్ యాదవ్ తెలిపారు. బుధవారం మలక్‌పేటలోని ఎస్‌ఏ పటేల్ అండ్ కో డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నితీష్ యాదవ్ మాట్లాడుతూ, మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాప్లస్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని అన్నారు. అల్ట్రాప్లస్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జ్‌లు, రహదారుల నిర్మాణానికి సరి అయిన ఎంపిక అని అన్నారు. అల్ట్రాప్లస్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని తెలిపారు. ఈ సందర్భంగా 90 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ డాక్టర్ ఎస్ఎం ఖాద్రీ మాట్లాడుతూ, భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు.కార్యక్రమంలో మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రి పాల్గొన్నారు.

13న పతంగుల తయారీపై వర్క్‌షాప్

బంజారాహిల్స్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని సింప్లి నామ్‌ధారీస్‌లో చిన్నారులకు గాలిపటాల తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఆదర్శ్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5–12 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు ఈ నెల 13న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. ఇందులో పతంగుల తయారీ విధానాన్ని పిల్లలకు వివరించడంతో పాటు వారితో తయారు చేయించి జీవితాంతం గుర్తుండిపోయేలా జ్ఞాపకాలను వారికి అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్: 63022 41108.

కారు అద్దాలు పగులగొట్టి దాడి

విజయనగర్‌కాలనీ : అకారణంగా ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచి కారు అద్దాలు పగలగొట్టిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్‌లో నివసించే మీర్ ముర్తుజాఅలీ (50) ఈనెల 9న కుటుంబసభ్యులతో కలిసి తన కోడలు జన్మదిన వేడుకలను మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. అనంతరం కారు నెంబరు(టీఎస్07టీజీ7729)లో అర్ధరాత్రి 12 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. షేక్‌పేట ఫ్లైఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ.. ఓవర్‌టేక్ చేశారు. అంతేకాకుండా పదే పదే హారన్ మోగిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. రేతిబౌలి పిల్లర్ నం 31 వద్దకు రాగానే 1818 కారులో వస్తున్న నజీబుద్దీన్ అతడి మిత్రులు బాధితుడి కారు అద్దాలను రాయితో పగులగొట్టి ముర్తుజాఅలీని గాయపరచడంతో పాటు మహిళలను దుర్భాషలాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ క్రాంతి యువజన సంఘం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ డీఈ దామోదర్‌తో కలిసి పరిశీలించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రతి సమస్యను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

ప్రతి ఒక్కరూ బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ యువమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులైన నిఖిల్‌కు బుధవారం లచ్చిరెడ్డి నియామక పత్రం అందజేశారు. డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు గౌరి శంకర్, నాయకులు సంపత్, అక్బర్, అక్షయ్, సూర్య, రుత్విక్, ప్రణవ్, విశాల్, సందీప్, చరణ్, అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఎల్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



డీఆర్‌డీఎల్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హస్తినాపురం: డీఆర్‌డీఎల్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంప్రసాద్‌రావు, కార్యదర్శిగా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా యాదవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా రమేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా సోమేశ్వర్, దాసారామ్, రాజుగుప్తా, వెంకటేష్‌గుప్తాలను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు రాంప్రసాద్‌రావు తెలిపారు.

పట్టాలు ఇచ్చారు.. పొజిషన్ ఇప్పించండి!

ఎమ్మెల్యే సబితారెడ్డికి డబుల్ ఇళ్ల లబ్ధిదారుల వినతి



డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తమకు వెంటనే డబ్బుల్ బెడ్ రూమ్ ఇళ్ల పొజిషన్ ఇప్పించాలని మహేశ్వరం నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తైన ఇళ్లను అధికారులతో మాట్లాడి వెంటనే తమకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌కేపురం, సరూర్‌నగర్‌తో పాటు వివిధ మున్సిపాలిటీలు, మండలాలకు చెందిన లబ్ధిదారులు ఎమ్మెల్యే సబితారెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని కేటాయిస్తూ అధికారులు పట్టాలు ఇచ్చారని, ఎన్నికల కారణంగా ఆ ఇళ్ల పొజిషన్ ఇంకా తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసి నెల రోజులు కావస్తున్నా..ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ తీసుకొని తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటి పొజిషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మంజుల, సక్కుబాయి, ఉమారాణి, సంధ్యా, హైమావతి, శోభారాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి45, కాకర 52, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 31. దొండ 35, ఆలు 25, ఉల్లి 26, గోకర 50, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 55, మునగ 65, చిలగడదుంప 50, బీట్‌రూట్ 17, కీర 17, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. దుర్గాభవానీనగర్, మాదన్నపేట, వినయ్‌నగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్ నగర్, సెంట్రల్ ఎక్స్ఛేంజ్ ఈస్ట్ మారుతీనగర్, యాదగిరి నగర్, దుర్గాభవానీనగర్, కృష్ణానగర్, బాలాజీనగర్, చంపాపేట మెయిన్‌రోడ్, సైదాబాద్ ఎమ్మార్వో కార్యాలయ ప్రాంతం, రెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన కార్పొరేటర్లు



కిషన్‌రెడ్డిని కలిసిన ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్

చైతన్యపురి: కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని బుధవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకోవాలి

లింగోజిగూడ: యాదవులు సమష్టిగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావు అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం నాగోలులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్య తరగతి యాదవుల కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సమస్యల పరిష్కారానికి ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, వర్కింగ్ అధ్యక్షుడు చింతల రవీందర్, ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్, నాయకులు శేఖర్, శ్రీనివాస్, శ్రీహరి, డి.శ్రీనివాస్, రమేష్, యశ్వంత్, మనీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బీసీ బంధు పథకాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

లింగోజిగూడ: బీసీ బంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులుకు వెంటనే రూ.లక్ష చెక్కును అందజేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ కోరారు.బుధవారం నాగోలు డివిజన్‌లో వంశరాజ్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతివృత్తి దారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేతి వృత్తిదారులను ఆదుకోవడానికి గత ప్రభుత్వం బీసీ బంధు పథకం అమలు చేసిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తైనా ఎన్నికల కోడ్ రావడంతో చెక్కుల పంపిణీ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని యథావిధిగా అమలు చేసి చేతి వృత్తిదారులకు అండగా నిలువాలని కోరారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలు, ఎంబీసీలకు అధిక శాతం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శంకర్, మనోజ్‌గౌడ్, శ్రీనివాస్, వేణుగోపాల్, కస్తూరి, అశోక్, నరసింహయాదవ్, శివకుమార్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చైన్ స్నాచింగ్‌లు

- యువకుడి అరెస్టు
- రూ. 6 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

లింగోజిగూడ: జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దవూర మండలం, అల్వాల్ గ్రామానికి చెందిన చెవుల ప్రశాంత్‌కుమార్ (28) కుటుంబం ప్రస్తుతం నాగార్జున సాగర్, హిల్ కాలనీలో నివాసం ఉంటోంది. 2018లో ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన ప్రశాంత్‌కుమార్ ఎల్‌బీనగర్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడ్డ అతను ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్‌లను ఎంచుకున్నాడు. పథకం ప్రకారం ముందుగానే ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి దానిపై తిరుగుతున్నాడు. ఈ నెల 8న నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీలో ఉండే పద్మ నాగోలు శ్రీనివాస్ కాలనీలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. నూతన భవనం వద్ద పద్మ ఆటోలో ఒంటరిగా కూర్చొని ఉండగా ప్రశాంత్‌కుమార్ గమనించాడు. ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆమె మెడలో ఉన్న సుమారు 6 తులాల బంగారు ఆభరణాలను స్నాచింగ్ చేసుకుపోయాడు. పద్మ కుటుంబ సభ్యులు వెంటనే నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసుల సహకారంతో బుధవారం నాగోలు ఎక్స్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో స్విఫ్ట్ కారు (ఏపీ 09సీడీ7266)లో వెళ్తున్న ప్రశాంత్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అసలు విషయం బయటపెట్టాడు. పోలీసులు ప్రశాంత్ వద్ద నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6 లక్షలు వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రశాంత్‌పై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఒక కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి



డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: మరమ్మతు పనులు జరిగేటప్పుడు కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కమలానగర్ రోడ్ నంబర్–5లో జరుగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కాలనీలో తరచుగా డ్రైనేజీ నీరు పొంగి స్థానికులు ఇబ్బందులకు గురవుతుండటంతో డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, రాజేష్, మధుసూదన్, ప్రశాంత్, నర్సింగ్, నరేష్, శివ, బీజేపీ నాయకులు మురళి, వంశీ, టింకు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలు

- అధ్వానంగా మారుతినగర్ ప్రధాన రహదారి
- పట్టించుకోని అధికారులు



గుంతలతో నిండిన మారుతినగర్ రోడ్డు

బడంగ్‌పేట్: కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్లకు మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పిస్తామని ఎన్నికల ముందు అధికారులు రోడ్లను తవ్వించారు. ఎన్నికలు ముగిసినా కూడా వాటిని పట్టించుకోకపోవడంతో ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రమాదకరంగా మారాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కొత్తగా ఏర్పాటు చేసిన నూతన మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని రాజీవ్ గృహకల్పకు వెళ్లే ప్రధాన రహదారి మారుతినగర్ కాలనీ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. నాటి అధికారులు మారుతినగర్ మధ్య నుంచి వెళ్తున్న రోడ్డును పాయింట్‌గా తీసుకుని రోడ్డుకు ఇటు, అటుగా ఉన్న ఇళ్లను 23వ, 28వ డివిజన్‌గా ఏర్పాటు చేసి కాలనీని రెండుగా విభజించారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అధికారులు బీటీ రోడ్డుగా ఉన్న ప్రధాన రహదారి మీదుగా డ్రైనేజీ అవుట్ లెట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పి రోడ్డును తవ్వి హడావుడిగా డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారు. సుమారు వెయ్యి ఇళ్లు ఉన్న ఈ కాలనీలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా అతి చిన్న పైప్‌లైన్లు వేశారు. డ్రైనేజీ లైన్ వేసి అలాగే వదిలివేయడంతో ఇళ్లలో నుంచి వస్తున్న నీరు, కురిసిన వర్షాలకు రోడ్లు నిండి చెరువును తలపిస్తున్నాయి. మోకాళ్లలోతు గుంతలు ఏర్పడంతో వాహనదారులు ద్విచక్ర వాహనాలపై వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఆయా పనుల నిమిత్తం ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంతల వల్ల కొత్తగా వేసిన డ్రైనేజీ కవర్లు సైతం పాడయ్యాయి. సేఫ్ సైడ్ డ్రైవింగ్ పేరుతో వన్‌సైడ్ గా వెళ్తూ వాహనదారులు ఘర్షణలకు దిగుతున్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పనులు వదిలివేశారు



కాలనీకి డ్రైనేజీ అని చెప్పి.. ఇరుకైనా పైపులు వేసి డ్రైనేజీ లైన్‌ను పూర్తి చేసి వదిలివేశారు. ఎన్నికలు పూర్తయిన ఇంకా రోడ్డు పనులు చేయడం లేదు. దీని వల్ల నిత్యం కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తున్నాయి. అధికారులు, కార్పొరేటర్లు స్పందించి రోడ్డు వేసేలా చూడాలి.

– సైదులు, కాలనీవాసి

అయోధ్య అక్షింతల పంపిణీ



ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో అంక్షితలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మూసారంబాగ్ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతల వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి అక్షింతలకు స్వాగతం పలికారు. ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి స్వామివారి అక్షింతలు అందజేశారు. కాలనీవాసులు అంజయ్య, రవీందర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, దేవేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

13న గోదా రంగనాథుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

లింగోజిగూడ: శ్రీ గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 13న ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ లక్ష్మీనారాయణ సేవసమితి,, ధార్మిక ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ నిర్వాహకురాలు దివ్యశ్రీ రమణ చక్రవర్తులు తెలిపారు. కల్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను బుధవారం కొత్తపేటలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివ్యశ్రీ మాట్లాడుతూ, కల్యాణ మహోత్సవాన్ని కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్వేత గార్డెన్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో సేవ సమితి సభ్యులు వెంకటరమణార్యులు, అనిత, మౌనిక, లావణ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మల్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకొని పూలబొకే, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని నాయకులకు రంగారెడ్డి సూచించారు. కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, సీపీఐ నాయకుడు అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ఘనంగా ధనుర్మాస పూజలు



అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అష్టలక్ష్మి అమ్మవారికి, నారాయణస్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి పాశురం కార్యక్రమం నిర్వహించారు. 25 శ్రీవైష్ణవ ఆలయాలకు విశేష శేషమాలలను అందజేసి.. వాటిని ఆలయాల నుంచి తిరిగి ఊరేగింపుగా అష్టలక్ష్మి ఆలయానికి తీసుకొచ్చి గోదారంగనాయక స్వామి వారికి సమర్పించారు. అనంతరం దీపోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమా సరేష్, కోశాధికారి అంజయ్య, చిలుక ఉపేందర్‌రెడ్డి దంపతులు, ఎం. శ్రీనివాస్, డి.శ్రీనివాస్, శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సాహెబ్‌నగర్ విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వనస్థలిపురం: సిద్దిపేటలో ఈ నెల 11 (గురువారం) నుంచి జరిగే 49వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలకు సాహెబ్‌నగర్‌లోని నక్క భాగమ్మ యాదవ్, నక్క వెంకటస్వామి యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రమ్య, శ్రావణి, అక్షయలు హైదరాబాద్ జట్టు తరఫున ఆడనున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దినేష్‌కుమార్, పీఈటీ శ్రీను నాయక్, ఉపాధ్యాయులు నాగశేషు విద్యార్థినులను అభినందించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలికకు తీవ్రగాయాలు

హస్తినాపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని బాలికకు తీవ్ర గాయలైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భాగ్యలత శారదానగర్ మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న బాలికను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలికకు తీవ్రగాయాలు కాగా, ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. బాలిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వనస్థలిపురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మర్యాదపూర్వక కలయిక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

– మన్సూరాబాద్